

యాసంగికి బేఫికర్



శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ప్రస్తుత సీజన్‌లో రికార్డు స్థాయిలో నీరు వచ్చి చేరింది. 1983-84 సంవత్సరంలో ప్రాజెక్టులోకి 1,165 టీఎంసీలు, 1988-89 సంవత్సరంలో 912.95 టీఎంసీలు, 1989-90 సంవత్సరంలో 576.28 టీఎంసీలు, 1990-91 సంవత్సరంలో 687.69 టీఎంసీలు, 1998-99 సంవత్సరంలో 552.44 టీఎంసీలు, 2005-06 సంవత్సరంలో 374.42 టీఎంసీలు, 2006-07 సంవత్సరంలో 515.48 టీఎంసీలు, 2021-22 సంవత్సరంలో 480 టీఎంసీలు, 2022-23 సంవత్సరంలో 200.682 టీఎంసీలు, 2023-24 సంవత్సరంలో 251.720 టీఎంసీలు, 2024-25 సంవత్సరంలో ఈనెల 24వ తేదీ వరకు 880.969 నీరు వచ్చినట్లు రికార్డులు తెలుపుతున్నాయి.

డ్యామ్‌లోకి భారీ స్థాయిలో నీరు..

- నిండుకుండలా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు
- ఈనెల 24వ తేదీ వరకు 880.969 టీఎంసీలు రాక
- దిగువకు వదిలింది 813.256 టీఎంసీలు
- యాసంగిలో పూర్తి స్థాయి ఆయకట్టుకు నీరందించే అవకాశం

జగిత్యాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీరాం సాగర్ ప్రాజెక్టు నిండుకుండలా మారడంతో యాసంగి సాగుకు ఢోకా లేకుండా పోయింది. ఎగువ ప్రాంతాల నుంచి ఇప్పటికిప్పుడు వరదలు నిలిచి పోయినా పూర్తి స్థాయి ఆయకట్టు రెండో పంటకు నీరందించడానికి ప్రాజెక్టులో పుష్కలంగా నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం ఎస్సారెస్పీలోకి స్వల్పంగా 20 వేల క్యూసెక్కుల వరద నీరు కొనసాగుతోంది. కాలువల ద్వారా ప్రస్తుతం ఆయకట్టుకు నీరు అంతగా డిమాండ్ లేదు. నవంబర్ మొదటి వారం వరకు వానాకాలం సీజన్‌కు నీటి విడుదల నిలిపి వేసే అవకాశం ఉంది.

అప్పటి వరకు వరి పంటలు పూర్తిగా కోతకు వస్తాయి. ప్రాజెక్టులోకి వానాకాలం సీజన్ ప్రారంభం నుంచే ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరదలు రావడంతో ఆగస్టులోనే నిండిపోయింది. 80.501 టీఎంసీల పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరు కుంది. అప్పటి నుంచి మిగులు జలాలను దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రస్తుత యేడాది జూన్ ఒకటి నుంచి ఈనెల 24వ తేదీ వరకు డ్యామ్‌లోకి 880.969 టీఎంసీల వరద నీరు వచ్చింది. ప్రాజెక్టు నుంచి దిగువకు ప్రస్తుత సీజన్‌లో 813.256 టీఎంసీల నీటిని వదిలారు. నవంబరు చివరి వారం నుంచి యాసంగి ప్రణాళిక చేసి కాలువల ద్వారా నీటి విడుదల చేపట్టే అవకాశం ఉన్నట్లు ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది ప్రాజెక్టునకు పుష్కలంగా వరద నీరు రావడంపై ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తగ్గుతూ.. పెరుగుతూ..

ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గుతూ పెరుగుతూ ఉంది. దీంతో ప్రాజెక్టు నుంచి గోదావరి నీటి విడుదలను తగ్గిస్తూ పెంచుతున్నారు. ప్రాజెక్టులోకి ప్రస్తుతం ఎగువ ప్రాంతాల నుంచి వరద రావడం 20 వేల క్యూసెక్కులకు పడిపోయింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 80.501 టీఎంసీలు కాగా ప్రస్తుత పూర్తి స్థాయి నీటి నిల్వ ఉంది. ప్రస్తుతం కాకతీయ కాలువ ద్వారా 4,000 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4,000 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, సరస్వతీ కాలువ ద్వారా 650 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు, ఆవిరి ఆవడం ద్వారా 573 క్యూసెక్కులు వ్యయం అవుతోంది.

బాబ్లీ మూసినా...

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఈనెల 28వ తేదీ వరకు గోదావరి ఎగువప్రాంతంలోని మహారాష్ట్రలో గల బాబ్లీ ప్రాజెక్టు గేట్లు తెరిచి ఉంచుతారు. మహారాష్ట్ర సర్కార్ బాబ్లీ ప్రాజెక్టును 2.4 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించింది.

దీంతో రెండు రాష్ట్రాల మధ్య జల వివాదాలు తలెత్తి కోర్టుకు ఎక్కారు. ప్రతి యేడాది జూలై 1వ తేదీన బాబ్లీ గేట్లు ఎత్తి అక్టోబరు 28వ తేదీ వరకు తెరిచి ఉంచాలని కోర్టు తీర్పులో పేర్కొంది. ఈనెల 29న ఉదయం బాబ్లీ గేట్లను మూసి వేస్తారు. అయితే మరింత వరద నీరు పెరిగితే బాబ్లీ గేట్లు మూసివేయడం కష్టమే. మూసేసినా ఎస్సారెస్పీ ఆయకట్టుకు యాసంగికి ఢోకా లేకుండా నీరు సరఫరా చేయవచ్చు. వానాకాలంలో శ్రీరాం సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి ఆయకట్టుకు కాలువల ద్వారా నీటి విడుదల చేపట్టారు. ప్రస్తుతం యాసంగిలో కూడా అంతేస్థాయి ఆయకట్టు నీటి సరఫరా చేపట్టే అవకాశం ఉందని ప్రాజెక్టు అధికారులు అభిప్రాయ పడుతున్నారు.

ఎస్సారెస్పీ ఆయకట్టు..

ఎస్సారెస్పీ మొదటి దశ ఆయకట్టు 9,68,640 ఎకరాలు, రెండో దశ 4,40,000 ఎకరాలు ఉంది. వరద కాలువ 2,20,000 ఎకరాలు, సదరమట్ ఆయకట్టు 12,000 ఎకరాలు, కడెం ప్రాజెక్టు 68,000 ఎకరాలు, అలీసాగర్ ఎత్తిపోతలు 57,793 ఎకరాలు, గుత్ప ఎత్తిపోతల పథకం 38,967 ఎకరాలు, చౌటుపల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతలు 11,600 ఎకరాలు, నిజామాబాద్ జిల్లాలో 14 ఎత్తిపోతలు పథకాలకు 34,948 ఎకరాలు, ఆదిలాబాద్ జిల్లాలో 9 ఎత్తిపోతలు 30,417 ఎకరాలు ఆయకట్టు ఉంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

మిగతా 8లో

తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

పెగడపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వరి కోతలు ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా ప్రభుత్వం ఇంతవరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడం దుదృష్టకరమని, వెంటనే ప్రారంభించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం అన్నారు. శనివారం పెగడపల్లి మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలసి సత్యం విలేకరులతో మాట్లాడారు. ఒకవైపు అకాల వర్షాలతో తెలంగాణ రైతాంగం తల్లడిల్లిపోయి ప్రభుత్వానికి కనీసం చీమకుట్టినట్లయినా లేదని విమర్శించారు. గత రబీలో సన్న ధాన్యం విక్రయించిన రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంబించి ధాన్యం కొనుగోలు చేపట్టాలని కోరారు. సమావేశంలో బిజెపి మండల అధ్యక్షుడు పల్లె మోహన్ రెడ్డి, కార్యదర్శి కడారి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలి

గొల్లపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటూ వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించి పశు సంపదను కాపాడుకోవాలని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డా. ప్రకాశ్ పాడి రైతులకు సూచించారు. శనివారం గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్ గ్రామంలో పశు సంవర్ధక గొల్లపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటూ వ్యాధి నివారణ టీకాలు పంపిణీ కార్యక్రమంను ఆయన పరిశీలించారు. అనంతరం మండల పశు సంవర్ధక శాఖ అధికారి డా. రవీందర్ పశువులకు గాలికుంటూ వ్యాధి నివారణ టీకాలు వేసి అవసరమున్న పశువులకు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డా. రవీందర్, వీఎల్‌వో రవీందర్, ఎల్ఎస్‌ఏ రాజశ్రీ, రవి, నిశాంత్, రమేష్ తదితర పశువైద్య సిబ్బందితో పాటు పాడిరైతులు పాల్గొన్నారు.

పొలస్తేశ్వర ఆలయ చైర్మన్‌గా భూమయ్య

జగిత్యాలరూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస పౌలస్తేశ్వర ఆలయ చైర్మన్‌గా పొలాస గ్రామానికి చెందిన భారతపు భూమయ్య ఎన్నికైనట్లు పొలాస పౌలస్తేశ్వర ఆలయ ఈఓ సురేందర్ తెలిపారు. ఆలయ ధర్మకర్తలుగా కొండల్ రావు, రాజయ్య, సత్యనారాయణ, వనిత, నాగరాజులు కొనసాగుతారని తెలిపారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

రాయికల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని రాయికల్ మండల ఏఈ టి.నవీన్ అన్నారు. రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తగు జాగ్రత్తలు తీసుకున్న తర్వాతనే విద్యుత్ పరికరాలను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గట్టు రమేష్, నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను విస్మరిస్తే జైలుకే

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ బాధ్యత వారసులదేనని, విస్మరిస్తే చట్టప్రకారం శిక్షార్హులు అవుతారని జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్ హెచ్చరించారు. శనివారం ఆర్డీఓ చాంబర్‌లో వయోవృద్ధుల సంక్షేమ చట్టం అవగాహన ప్రచార పత్రికను ఆయన ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండులను విస్మరిస్తే జరిమానాతో పాటు జైలుకు పంపే అవ కాశం ఉన్నదని అన్నారు. సీనియర్ సిటి జన్స్ జిల్లా అధ్యక్షులు హరిఅశోక్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని పలు వురు తల్లిదండ్రుల తరపున తన వాదన వినిపించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కార్యా లయం ఏవో రవికాంత్, ఎఫ్ఆర్వో కొండయ్య, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ పద్మజ పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేయాలి

-అదనపు కలెక్టర్ బీఎస్ లత



కొనుగోలు కేంద్రంలోని మొక్కజొన్నను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఇబ్రహీంపట్నం, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మొక్కజొన్న కొనుగోళ్లను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు పడుతున్ననందున అధికారులు మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేయాలనీ, రైతులు నాణ్యమైన,శుద్ధి చేసిన మొక్కజొన్నను మార్కెట్‌కు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. ఒక ఎకరానికి 17 క్వింటాళ్ల మొక్కజొన్న మాత్రమే కొనుగోలు చేస్తున్నారని రైతులు తెలియజేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు లేఖ రాసి 25క్వింటాళ్లు కొనుగోలు చేసేలా చూస్తామని రైతులకు తెలియజేశారు. అనంతరం మార్కెట్‌లోని గోదాములను పరిశీలించారు. వరికోతలు మొదలైన నేపథ్యంలో మండలంలో కొత్తగా ఏమైనా కొనుగోలు కేంద్రాలు అవసరం ఉంటే ముందస్తుగా తెలియ జేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్‌డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీవో మొహమ్మద్ సలీమ్, మండల వ్యవసాయాధికారి రాజకుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగాం రాజు, ఇబ్రహీంపట్నం పి ఎ సి ఎస్ చైర్మన్ బద్దం గోపి, రైతులు తదితరులు ఉన్నారు.

రోళ్లవాగు ప్రాజెక్టుకు షటర్ బిగించేదెన్నడు?

-జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత



మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

సారంగాపూర్, అక్టోబర్, 25 (ఆంధ్రజ్యోతి): ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు రోళ్లవాగు ప్రాజెక్టుకు షటర్ బిగించని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అభివృద్ధి, పర్యాటక ప్రాంతం చేస్తా అని మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షురాలు దావ వసంత సురేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే అభివృద్ధి ముసుగులో స్వంత ప్రయోజనాలు, కాంట్రాక్టర్ కమీషన్‌ల కోసం తప్ప చేసిందేమీ లేదని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రోళ్ళవాగు ప్రాజెక్టును అభివృద్ధి చేస్తే కాంగ్రెస్ రెండేళ్ళ పాలనలో కనీసం షటర్‌లు బిగించని దౌర్భాగ్యస్థితిలో ఉందని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పదేళ్ళ కేసీఆర్ హయంలో అనుభవించినపుడు బీర్‌పూర్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచన గుర్తుకు రాలేద అని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి కన్నా కాంగ్రెస్ పాలనలో చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కోనాపూర్ బ్రిడ్జి పనులు పూర్తి కాక పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షులు తేలు రాజు, సీనియర్ నాయకులు సాగిసత్యంరావు, మండల ప్రధాన కార్యదర్శి అనంతుల గంగారెడ్డి, బైరి మల్లేష్, ఒడ్నాల జగన్, భాస్కర్ నాయక్, సాంబారి గంగాధర్, మ్యాకల జలెందర్, తదితరులు పాల్గొన్నారు.

'రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి'



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, ఎమ్మెల్యే సత్యం

కొడిమ్యాల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగ కుండా చూడాలని కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని పూడూర్, కొడిమ్యాల, రామకిష్టాపూర్, చెప్యాల, నాచుపల్లి గ్రామాలలో కొడిమ్యాల, పూడూర్ సింగిల్ విండోల, ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించే వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్వాహకులు రైతుల వద్ద వరిధాన్యం కొనుగోలు చేసి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వరిధాన్యం గ్రేడ్ ఏ రకానికి 2389 రూపాయలు, సాధారణ రకానికి 2369 రూపాయలు చెల్లించడం జరుగుతుందన్నారు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని తీసుకువచ్చిన రైతులకు కనీస మద్దతు ధరను చెల్లించడం జరుగుతుందన్నారు. వరిధాన్యం తేమ శాతం 17ఉండే విదంగా చూసుకోవాలన్నారు. వర్షసూచన ఉన్నందున రైతులు నిర్వహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్‌గౌడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి కారి రఘువరణ్, సివిల్ సప్లై అధికారి జితెందర్‌రెడ్డి, డీఎం జితెందర్, మండల ప్రత్యేక అధికారి శ్యాంప్రసాద్, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో స్వరూప, ఏవో జ్యోతి, ఏపీఎం మల్లేశం, ఆర్ఐ కరుణాకర్, సింగిల్ విండోల కార్యదర్శులు గంగాధర్, రాజేందర్‌రెడ్డి, మల్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రమేష్, కొడిమ్యాల, పూడూర్ సింగిల్ విండోల చైర్మనులు రాజనర్సింగ రావు, రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు నారాయణగౌడ్, మల్లిఖార్జున్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, స్వామి, ప్రసాద్, అజయ్‌రెడ్డి, రాజు, అంజయ్య, కిషన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, మల్లేశం, సింగిల్ విండోల డైరెక్టర్లు, సెర్ప్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేరస్థులకు శిక్షపడేలా చర్యలు

● ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల టౌన్, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): నేరం చేసిన వారికి శిక్ష తప్పదని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ నేర నియంత్రణలో న్యాయస్థానాలలో న్యాయ నిరూపణలో జిల్లా పోలీసులు విశేష ఫలితాలు సాధిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ సంవత్సరం జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లా పోలీసు శాఖ సమగ్రంగా వ్యవహరించి న్యాయస్థానాల్లో 83 కేసుల్లో తీర్పు వెలువడగా 92 మంది నేరస్తులకు శిక్షలు మరియు జరిమానాలు విధింప బడ్డాయన్నారు. సమాజంలో నేరం చేసిన వారెవరు శిక్ష నుంచి తప్పించుకోలేరన్నారు. పోలీసులు మరియు ప్రాసిక్యూషన్ విభాగం సమన్వయంతో పని చేసి న్యాయ నిరూపణతో శిక్షలు పడేలా చేస్తున్నామన్నారు. క్షణికావేశంలో చేసిన నేరాలకైనా శిక్ష తప్పదని అందరూ చట్టానికి లోబడి పని చేయాలని అన్నారు. జిల్లా మహిళలపై నేరాలు, మద్యం, గంజాయి, దొంగతనాలు, మోసపూరిత ఆర్థిక నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి కేసులు తకవరితగతిన దర్యాప్తు చేసి కోర్టులో పటిష్ఠమైన సాక్షాలతో ప్రాసిక్యూషన్ విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

జిల్లా ప్రాసిక్యూషన్ అధికారులు, సీఐలు, ఎస్ఐలు, ఇన్వెస్టిగేషన్ అధికారులు క్రమం తప్పకుండా కేసుల పురోగతిని సమీక్షిస్తూ తీర్పులు శిక్షల రూపంలో రావడమే లక్ష్యంగా కృషి చేస్తున్నారని ఎస్పీ తెలిపారు. ప్రజలు పోలీసుల పట్ల నమ్మకం ఉంచి చట్టం పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయ స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన బోగ రాధ కుటుంబానికి 7 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. శనివారం మృతురాలి ఇంటికి వెళ్ళి ఇట్టి ఆర్థిక సమాయాన్ని అందించిన అనంతరం సంఘం అధ్యక్షులు చిలుకమారి శ్రీనివాస్ మాట్లాడుతూ నిరుపేద వ్యక్తి మరణిస్తే ఆర్థిక సహాయంతో పాటు ఇతర సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ భక్త మార్కండేయ స్వచ్ఛంద సంస్థ సభ్యులు మానపురి శ్రీనివాస్, కోమాకుల సుదర్శన్, బోగ రాజేశం, వేముల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

'రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రాధాన్యం'



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సూచించారు. అభివృద్ధి పనుల మంజూరులో అత్యంత ప్రాధాన్యత గల పనులనే ప్రతిపాదించాలని జగిత్యాల, రాయికల్ మున్సిపల్ కమిషనర్‌లకు సూచించారు. శనివారం అభివృద్ధి పనులను జగిత్యాలకు 62కోట్లు, రాయికల్ మున్సిపాలిటీకి 15 కోట్లు నిధులను ముఖ్యమంత్రి మంజూరు చేయగా స్థానిక మెప్మా కార్యాలయంలో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో ప్రతి పైసా ప్రజలకు ఉపయోగ పడేలా ఏళ్ళుగా ప్రజలు నివాసం ఉంటున్న ప్రాంతాలలో రోడ్డు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. పట్టణంలో మౌలిక సదుపాయాలు, శ్మశాన వాటికలు, కరెంటు పోల్స్, పార్కులు, జిమ్‌లు మైదానాల అభివృద్ధి జగిత్యాల పట్టణంలో విలీన ప్రాంఆలలో అర్బన్ హౌసింగ్ కాలనీ డబుల్ బెడ్‌రూం కాలనీ, తారకరామ నగర్, ఇల్లా ప్రాధాన్యత ప్రకారం ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో జగిత్యాల , రాయికల్ మున్సిపల్ కమీషనర్‌లు స్పందన, మనోహర్, డిఈ ఆనంద్, ఏఈలు శరన్, అనిల్, లక్ష్మీ, పట్టణ ప్రణాళికాదికారి శ్రీకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నియంత్రించాలి

ప్రజలందరు ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో భాగంగా ఆపి-రోటరీ క్లబ్ మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జగిత్యాల పట్టణ పరిశుభ్రతలో ప్రధాన పాత్రధారులైన మున్సిపల్ పారిశుధ్య కార్మికులు 300 మందికి జనపనార బ్యాగులను అదన పు కలెక్టర్ రాజాగౌడ్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వార్డును ఆధునీకరించడంలో స్వచ్ఛంద సంస్థల సహకారం ఎంతో అవసరమన్నారు. మున్సిపల్ అధికారులు పారిశుధ్య కార్మికులు ప్లాస్టిక్ నివారించడంలో ప్రజలను చైతన్య వంతులను చేయాలనిఎమ్మెల్యే ఈసందర్భంగా సూచించారు. అయినప్పటికి వారు ప్లాస్టిక్ వాడితే చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల మున్సిపల్ కమిషనర్ స్పందన, మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, రోటరీ క్లబ్ సభ్యులు మంచాల కృష్ణ, బొడ్ల జగదీష్, కూతురు రాజేష్, హరీష్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ .జంగిలి మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉమ్మడి జిల్లాలో ఆరుగురి బలవన్మరణం

ఉమ్మడిజిల్లాలో ఆరుగురు బలవన్మరణం చెందారు. వీరిలో ముగ్గురు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోగా, ఇద్దరు గడ్డి, పురుగు మందు తాగి, మరొకరు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే..

ఉరి వేసుకొని అంగన్‌వాడీ టీచర్..


పరిమళ(ఫైల్)

చందుర్తి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యసమస్యలతో పాటు ఆర్థిక ఇబ్బందులతో అంగన్వాడీ టీచర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం సనుగులలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సనుగుల గ్రామానికి చెందిన గొట్టె పరిమళ(36) దేవునితండా గ్రామపంచాయతీ పరిధిలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తోంది. కొంతకాలంగా అనారోగ్య సమస్యతో పాటు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పరిమళ మనస్తాపానికి గురై శనివారం ఉదయం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త నరేష్ ఆర్టీసీ అద్దెబస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని పెద్దూరులోగల డబుల్ బెడ్‌రూం ఇంటిలో షేక్ అహ్మద్(57) అనే వ్యక్తి శనివారం తెల్లవారుజామున ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. పెద్దూరు గ్రామ శివారులో ఉన్న డబుల్‌బెడ్‌రూం బ్లాక్‌నంబర్ 18ఇళ్లలో షేక్‌అహ్మద్, జుబేదా దంపతులు నివాసం ఉంటారు. వీరికి సంతానం లేదు. ఇటీవల షేక్‌అహ్మద్ కాలుకు తీవ్రగాయం కావడంతో అనారోగ్యం పాలయ్యాడు. అనారోగ్యంతో పాటు ఆర్థికఇబ్బందుల కారణంగా షేక్ అహ్మద్ తీవ్ర మనస్థాపంచెంది భార్య నిద్రిస్తుండగా తెల్లవారుజామున 2 గంటలకు ఇంట్లో ఉరివేసుకొని బలవన్మరణానికి ఒడిగట్టాడు. ఈ సంఘటనపై భార్య జుబేదా ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధుడు..

శంకరపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం ఎరడపల్లి గ్రామంలో ఓ వృద్ధుడు అనారోగ్య సమస్యలు తట్టుకోలేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎరడపల్లి గ్రామానికిచెందిన రిటైర్డ్ సింగరేణిఉద్యోగి కనకం రాజయ్య(67) కొంతకాలంగా తాగుడుకు బానిసై అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఆస్పత్రిలోవైద్యం చేయించుకున్నా వ్యాధులు నయం కాకపోవడంతో జీవితంపై విరక్తిచెంది శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి పెద్దకుమారుడు కనకం సంపత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జీవితంపై విరక్తిచెంది వృద్ధురాలు..

సారంగాపూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మనస్థాపానికి గురై సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామంలో బావిలో దూకి గాజెంగి జమున(60) అనే వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు, ఎస్సై గీత వెల్లడించిన వివరాల మేరకు జమున కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో తీవ్ర మానసిక క్షోభకు గురై జీవితంపై విరక్తిచెంది శనివారం వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెకు భర్త రాజేశం, కుమారుడు రాజు ఉన్నారు. కుమారుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై గీత పేర్కొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని భర్త..


రాంకీ(ఫైల్)

కోల్‌సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మార్కండేయకాలనీలో నివాసముండే గంధం రాంకీ(29) భార్య కాపురానికి రావడం లేదనే మనస్తాపంతో గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు. రాంకి భార్య కుటుంబ కలహాలతో పుట్టింట్లో ఉంటుంది. ఈనెల 20వ తేదినరాత్రి గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకోగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందినట్టు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాజయ్య పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరు..


లక్ష్మిరాజం(ఫైల్)

కరీంనగర్ క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని రాఘవేంద్రనగర్‌కు చెందిన వడ్లకొండ లక్ష్మిరాజం(64) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. శుక్రవారం రాత్రి భోజనంచేసి ఇంట్లో నిద్రించిన లక్ష్మిరాజంను శనివారం ఉదయం అతడి భార్య నిద్రలేపేందుకు వెళ్లింది. నోటి నుంచి నురగలు రావడం, పక్కనే పురుగుల మందు బాటిల్ ఉండడం గుర్తించింది. వెంటనే స్థానిక ఆర్‌ఎం పీతో పరీక్ష చేయించగా అప్పటికే మృతి చెందినట్లు వెల్లడైంది. లక్ష్మిరాజం ఇంటిపక్కన ఉన్న ఓ కుటుంబంలోని సుదర్శన్, సరోజన దపంతులు వారి కూతురు, కొడుకు, దుద్దెల శ్రీధర్, మున్సి పల్ ఏసీపీ వేణు, టీపీబీవో సయ్యద్‌ఖాదర్ తనచావుకు కారణమంటూ సూసైడ్ లెటర్ రాసి తనజేబులో పెట్టుకున్నాడు. వారి వేధింపులతోనే తనభర్త మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని, వారిపై చర్యలు తీసుకోవాలని లక్ష్మిరాజం భార్యవడ్ల కొండశారద పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కోర్టు ఆదేశాలతోనే నోటీసులు జారీ

కరీంనగర్ టౌన్: నగరపాలకసంస్థ పరిధిలోని రాఘవేంద్రనగర్ కాలనీలో ఆత్మహత్య చేసుకున్న వి.లక్ష్మిరాజం సూసైడ్ నోట్‌పై మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ డీసీపీ, ఏసీపీ, టీపీ ఎస్, టీపీబీవోతో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆరా తీశారు. అనంతరం డీసీపీ పేరుతో పత్రికా ప్రకటన విడుదల చేశారు. కోర్టు ఆదేశాలతోనే నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. తనఇంటి పక్కన ఉన్న లక్ష్మిరాజం సెట్ బ్యాక్‌లేకుండా ఇంటిని నిర్మించారని, దీనిపై చర్య తీసుకోవాలంటూ కాలనీకి చెందిన సుదర్శన్ ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. నిబంధనల మేరకు శారద, ఆమె భర్త లక్ష్మి రాజంకు షో కాజు నోటీసు జారీ చేశా మని, నిబం ధనలకు విరు ద్ధంగా ఏర్పా టు చేసిన కిటి కీలను తొలగించాలని ఆదేశాలిచ్చామని తెలిపారు. తన ఇంటివైపు నిబంధనలకు విరు ద్ధంగా కిటికీలు ఏర్పాటు చేశారని మరో ఫిర్యాదు చేసినా పట్టిం చుకోలేదంటూ సుదర్శన్ హైకోర్టులో పిటీషన్ వేశారని, దీంతో లక్ష్మిరాజం కు షోకాజు నోటీసు జారీ చేశామని పేర్కొ న్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు 22ఆగస్టు 2025న నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన కిటికీలను తొలగించినట్లు తెలిపారు. లక్ష్మిరాజం విషయంలో పూర్తిగా నిబంధనలకు లోబడి చర్యలు తీసుకున్నామని డీసీపీ ప్రక టనలో పేర్కొన్నారు.



పత్తి కొనుగోళ్లలో సీసీఐ కొత్త నిబంధనలు

- కపాస్ కిసాన్ యాప్ కీలకం
- స్లాట్ బుక్ చేసుకొని పత్తిని మిల్లుకు తీసుకుపోవాలి

చొప్పదండి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోళ్లలో సీసీఐ పలు మార్పులు తీసుకువచ్చింది. గతానికి భిన్నంగా ఈసారి యాప్‌లో స్లాట్ బుక్ చేసుకొని పత్తిని మిల్లుకు తీసుకుపోవాల్సి ఉంటుంది. స్లాట్ బుక్ చేసుకోకుంటే పత్తిని కొనరు. గతంలో రైతులు నేరుగా సీసీఐ కొనుగోలు కేంద్రానికి పత్తిని తీసుకువచ్చి అమ్ముకునేవారు. వ్యవసాయ శాఖ నమోదు చేసే పంటల వివరాల్లో పత్తి విస్తీర్ణం ఉంటే సరిపోయేది. ప్రస్తుతం పత్తి కొనుగోళ్లను యాప్ ద్వారానే చేపట్టాలని సీసీఐ నిర్ణయించింది. దీంతో రైతులు ఆందోళన, అయోమయానికి గురైతున్నారు.

మూడు రోజుల ముందు స్లాట్ బుక్


రైతులు కపాస్ కిసాన్ యాప్‌లో తమ సమీప వ్యవసాయ మార్కెట్, జిన్నింగ్ మిల్లును ఎంచుకోవాలి. పత్తి విక్రయానికి స్లాట్ తేదీలు కనిపిస్తాయి. పత్తి విక్రయానికి స్లాట్‌ను మూడు రోజుల ముందు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. బుక్ చేసిన తేదీన జిన్నింగ్ మిల్లుకు రైతు పత్తిని తీసుకుపోవాలి. అప్పుడే సీసీఐ పత్తిని కొంటుంది. స్లాట్ బుక్ చేసుకోకుంటే కొనుగోలుకు అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు.

ఆందోళనలో రైతులు

పత్తిని సాగు చేసిన రైతులు సీసీఐ తీసుకొచ్చిన కొత్త నిబంధనలతో ఆందోళన చెందుతున్నారు. కపాస్ కిసాన్ యాప్‌పై వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ రైతులు అయోమయానికి గురవుతున్నారు. ఆండ్రాయిడ్ ఫోన్ లేని రైతులు ఏమి చేయాలో పాలుపోని స్థితిలో ఉన్నారు. అన్ని ఉన్న రైతులు అవగాహన లేక యాప్‌లో తమ వివరాలను నమోదు చేయలేక పోతున్నారు. కౌలు రైతులకు యాప్‌లో ఎలాంటి స్థానం లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో పత్తి ధర బాగా పడిపోగా మద్దతు ధర కోసం సీసీఐకి పత్తి అమ్ముకోవాల్సిన సందర్భంలో యాప్ ద్వారా కొనుగోళ్లు రైతులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

● యాప్‌ను ఇలా వాడాలి..

సీసీఐ పత్తి కొనుగోళ్లను కపాస్ కిసాన్ యాప్ ద్వారా చేపడుతుంది. రైతులు తమ ఆండ్రాయిడ్ ఫోన్లలో కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ తరువాత మొబైల్ నంబర్‌తో లాగిన్ కావాలి. పేరు, భూమి వివరాలు, పత్తి పంట విస్తీర్ణం, పట్టదారు పుస్తకం, ఆధార్ కార్డు ఫొటోలను అప్‌లోడ్ చేయాలి. యాప్‌లో వివరాలను పొందుపరిచిన తరువాత వ్యవసాయ శాఖ రైతు పంటను, విస్తీర్ణాన్ని ధ్రువీకరించాల్సి ఉంటుంది. రైతు రిజిస్ట్రేషన్ పూర్తి కాగానే యాప్‌లో అప్రూవల్ వస్తుంది.



యాప్‌లో వివరాలు



కపాస్ కిసాన్ యాప్ కరపత్రం

పేకాట స్థావరంపై దాడి

● ఐదుగురిపై కేసు

ధర్మపురి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను శుక్రవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1,16,000నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. జగిత్యాల సీసీఎస్ సీఐ శ్రీనివాస్, ధర్మపురి పోలీసులు సంయుక్తంగా దాడిచేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదుచేశారు. జూదం ఆడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, కఠినచర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. దాడులు కొనసాగుతాయని ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

సుల్తానాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సయ్యపల్లి గ్రామస్టేజీ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మోయలావణ్య(43) మృతిచెందింది. కుటుంబ సభ్యులు, పోలీసులుతెలిపిన వివరాల మేరకు.. మంచిర్యాల జిల్లా మందమర్రిలో ఉండే లావణ్య తల్లి స్వగ్రామం ఎలిగేడు మండలం బుర్హాన్ మియాపేటకు వచ్చింది. తల్లి అనారోగ్యంతో బాధపడుతూ కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా రోజు ఆహారం తీసుకు వెళుతుం డేది. శనివారం రాత్రికూడా భోజనం తీసుకువెళ్లేందుకు సుల్తానాబాద్ మండలం నర్సయ్యపల్లి స్టేజీ వద్దకు వచ్చింది. కరీంనగర్ వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న క్రమంలో పెద్దపల్లి నుంచి కరీంనగర్ వైపు వెళుతున్న కారు వేగంగా ఢీకొట్టడంతో లావణ్య అక్కడిక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్రావణ్ కుమార్, పోలీస్ సిబ్బంది వివరాలు సేకరించి, మృతదేహాన్ని సుల్తానాబాద్ ఆసుపత్రికి తరలించారు.

మీడియా ముసుగులో బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్

వేములవాడ క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మీడియా ముసుగులో బెదిరింపులకు పాల్పడిన వేములవాడకు చెందిన ఎన్ రాజు అనే వ్యక్తిని శనివారం అరెస్ట్ చేశామని టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ పట్టణం అగ్రహారం గ్రామానికి చెందిన బొమ్మెల మహిపాల్ అనే వ్యక్తి వృత్తిపరంగా ఒగ్గు కళాకారుడు. పూజలతో పాటు మూలికా వైద్యం ద్వారా జీవనోపాధి పొందుతున్నాడు. ఈనెల11న వేములవాడకు చెందిన కరుణాకర్, ఎన్ రాజులు మహిపాల్‌కు ఫోన్‌చేసి 30ఇవ్వాలని లేకుంటే పేపర్‌లో రాస్తామని బెదిరించారు. దీంతో భయభ్రాంతులకు గురైన మహిపాల్ ఈనెల 14న ఫోన్‌పే ద్వారా రూ.10వేలు చెల్లించాడు. అయినప్పటికీ మిగతా రూ.20 వేలు ఇవ్వాలని బెదిరించారు. ఈ మేరకు బాధితుడు మహిపాల్ ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి ఈనెల 16న కరుణాకర్‌ను రిమాండ్‌కు తరలించగా, పరారీలో ఉన్న రాజును అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల బీభత్సం..

● మండేపల్లిలో ఎల్లమ్మ కమాన్‌కు ఢీ.. ● విద్యుత్తు సర్వీస్ వైరు, మీటరు ధ్వంసం
● ఆందోళనకు దిగిన గ్రామస్థులు

తంగళ్లపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇసుక ట్రాక్టర్లు తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామంలో బీభత్సం సృష్టించాయి. కోపోద్రిక్తులైన గ్రామస్థులు ఇసుక ట్రాక్టర్లను అడ్డుకుని ధర్నాకు దిగారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం మండేపల్లి శివారులోని మానేరునది నుంచి ఇసుక తరలించడానికి అనుమతి ఇచ్చారు. రెండు రోజులు పాటు ఇసుక ట్రాక్టర్లకు అనుమతి ఇవ్వగా మానేరు నది నుంచి ఇసుకను తరలిస్తున్న క్రమంలో ట్రాక్టర్ ఎల్లమ్మ దేవాలయం కమాన్‌కు ఢీకొట్టడంతో శిలాఫలకం ధ్వంసం అయ్యింది. ఇసుకను తరలిస్తున్న మరోట్రాక్టర్ పెద్ది ఎల్లవ్వ ఇంటికి సరఫరా విద్యుత్తు లైనుతోపాటు మీటర్‌ను ధ్వంసం చేసింది. దీంతో విద్యుత్తు వైర్లు తెగి రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యార్థులు పాఠశాలకు వెళ్లే సమయంలో విద్యుత్తువైరు ప్రమాదకరంగా పడిఉండడంతో గ్రామస్థులు ఆగ్రహానికి గురై ఎల్లమ్మ కమాన్ వద్ద ఇసుక ట్రాక్టర్లను అడ్డుకొని ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న ఆర్ఐ దినేష్, ఎస్ఐ ఉపేంద్రచారి సిబ్బందితో చేరుకుని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వమని హామీ ఇస్తేనే ఆందోళన విరమి స్తామని తేల్చిచెప్పారు. ఢీకొట్టిన ట్రాక్టర్లపై చర్యలు తీసుకుం టామని, ఇకముందు ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వబోమని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.


ధర్నా చేస్తున్న గ్రామస్థులతో మాట్లాడుతున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు

అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

● డ్రైవర్‌కు గాయాలు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం లాల్‌సింగ్ తండా గ్రామ శివారులు శనివారం అదుపు తప్పి వ్యవసాయ పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో మండలంలోని రంగంపేటకు చెందిన వాహన డ్రైవర్ రాములు గాయాలపాయ్యాడు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. అడవిపదిర గ్రామంలో వరిపంటను కోసి ధాన్యం ట్రాక్టర్‌లో లాల్‌సింగ్‌తండాలోని కొనుగోలు కేంద్రానికి తరలించాడు. తిరిగివస్తున్న క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి డ్రైవర్ రాములుకు గాయాలయ్యాయి. రాములును 108 వాహనంలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

తేనెటీగల దాడిలో 10మందికి గాయాలు


ముఖంపై గాయాలతో భూమారావు

కొడిమ్యాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామంలోని శ్మశానవాటికలో తేనెటీగల దాడిలో శనివారం 10 మందికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన కలకుంట్ల అమ్మాయి (70) అనే వృద్ధురాలు మృతి చెందగా ఆమె అంత్యక్రియలకు హాజరైన బంధువులపై తేనెటీగలు దాడి చేశాయి. శ్మశాన వాటికలో వృద్ధురాలి కాటికి నిప్పు పెట్టగానే తేనెటీగలు ఒక్కసారిగా లేచి దాడిచేయగా అక్కడున్న వారు తలో దిక్కు పరుగులు పెట్టారు. పెగడపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన తూకుంట్ల భూమారావుకు అధిక గాయాలు కాగా కొడిమ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించారు.

చిన్నారిపై కుక్కల దాడి


గాయపడిన చిన్నారి

కోల్‌సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఇందిరా నగర్‌లో నివాసముండే సహస్ర(4)అనే చిన్నారిపై శనివారం వీధి కుక్కలు దాడి చేశాయి. ఇంటిముందు ఆడుకుంటున్న చిన్నారిపై వీధి కుక్కల గుంపు దాడి చేయడంతో ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారిని గోదావరిఖని జనరల్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తు న్నారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వీధి కుక్కల బెడద తీవ్రమైంది. వీధి కుక్కలు బెడద తీవ్రమై చిన్నారులు బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది.

రైతులకు అండగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

● మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ


ఇల్లంతకుంటలో మక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఇల్లంతకుంట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా నిలువాలనే లక్ష్యంతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్‌కమిటీ కార్యాలయంలో శనివారం మక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అత్యధిక గ్రామాలలో ఇప్పటికే వరిదాన్యం కొనుగోలు కేంద్రాలు కొనసాగుతున్నాయని, మొక్కజొన్న రైతుల కోసం ఇల్లంతకుంటలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పత్తిరైతుల కోసం సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం ధాన్యం తీసుకవచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం రుణమాఫీ, పెట్టుబడి సాయం అందించడంతో పాటు సన్న వడ్లకు బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎమ్‌సీ చైర్మన్ ఐరెడ్డి చైతన్య మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రసాద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అయిలయ్య, మాజీఏఎమ్‌సీ చైర్మన్ మామిడి సంజీవ్, వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి, ఏఈఓ గంగ, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు. మండల కేంద్రానికి చెందిన అంతటి రామచంద్రం అనే అయ్యప్ప భక్తుడిని ఎమ్మెల్యే సత్కరించారు. రామచంద్రం 60రోజులలో 1400కిలోమీటర్ల పాదయాత్ర చేసి శబరిమలకు చేరుకున్నాడు. మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో నిర్మించాలని భావిస్తున్న మరుగుదొడ్ల వల్ల వ్యాపారస్థులకు ఇబ్బందిగా మారే అవకాశ ఉన్నందున మరో ప్రదేశానికి మార్చాలని ఎమ్మెల్యేకు పలువురు విన్నవించారు.

బైక్‌పై 120 పెండింగ్ చలాన్లు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో 120పెండింగ్ చలాన్‌లు, రూ.29560 జరిమానా ఉన్న ద్విచక్రవాహనాన్ని గుర్తించారు. శనివారం నగరంలోని కమాన్‌వద్ద కరీంనగర్ ట్రాఫిక్‌రిజర్వు ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. గణేష్‌నగర్‌కు చెందిన కట్కోజుల కిరణ్‌కుమార్ ద్విచక్రవాహనం(హోండా షైన్, టీఎస్ 22 7090)పై రాంగ్‌రూట్‌లో వెళ్తుండగా పట్టుకున్నారు. వివరాలు తనిఖీ చేయగా ఆ బైక్‌పై ఏకంగా 120పెండింగ్ చలాన్‌లు వాటికి సంబంధించి మొత్తం 29,650రూపాయలు జరిమానా ఉన్నట్లు గుర్తించారు. దీంతో బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.


బైక్‌తో ఆర్ఐ కుమారస్వామి, బైక్ యజమాని కిరణ్‌కుమార్

ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి


అనిల్(ఫైల్)

వేములవాడ రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓ రైతు ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతిచెందిన సంఘటన వేములవాడరూరల్ మండలం ఫాజుల్‌నగర్ గ్రామంలో జరిగింది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కిసరి అనిల్(45) అనే రైతు వ్యవసాయ పనుల నిమిత్తం బావి వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు ఆయన బావిలో జారి పడ్డాడు. శనివారం ఉదయం అనిల్ కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు వెతకగా బావిలో పడినట్లు గుర్తించారు. గ్రామస్థులు మృతదేహాన్ని బావినుంచి బయటకు తీశారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అనుమానాస్పద స్థితిలో రైతు మృతి


లక్ష్మారెడ్డి(ఫైల్)

ఓదెల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలనూర్‌లో శనివారం గీట్ల లక్ష్మారెడ్డి(65) అనే రైతు అనుమానాస్పదంగా మృతి చెందాడు. లక్ష్మారెడ్డికి మూడు ఎకరాల వ్యవసాయ భూమిఉండగా లంబాడ తండాకు చెందినవ్యక్తి కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. శనివారం 3గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన లక్ష్మారెడ్డి పొలంవద్ద మృతిచెంది ఉన్నాడని గ్రామస్థులు తెలిపారు. కొన్ని రోజుల నుంచి మద్యానికి బానిసైనట్లు సమాచారం. జీవితంపై విరక్తిచెంది పొలంవద్ద ఉరివేసు కొని మృతి చెంది ఉంటాడని గ్రామస్థులు పేర్కొంటున్నారు. మృతుడికి భార్య విజయ, ఇద్దరు కొడుకులు ఉన్నారు. ఒకరు ఆర్మీలో ఉద్యోగం చేస్తుండగా, మరొకరు ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు పోలీసులకు అందలేదు.

ఇరువురి ఘర్షణ.. పరస్పరం ఫిర్యాదులు

కోరుట్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని అల్లమయ్యగుట్ట ప్రాంతంలో శనివారం తాజా మాజీకౌన్సిలర్, మాజీ కౌన్సిలర్ భర్త మధ్య ఘర్షణ జరిగింది. గతంలో ఆప్రాంతంలో నివాసం ఉంటున్న కొంతమంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల స్థలాలను ప్రభుత్వం కేటాయించింది. ఆ స్థలంలో కొందరు వ్యక్తులు చదునుచేసి ప్లాట్లుగా ఏర్పాటుచేయడానికి ప్రయత్నించగా తాజా మాజీకౌన్సిలర్ పెర్లసత్యం కొంతమందితో అక్కడికి చేరుకొని పరిశీలించారు. విషయం తెలుసుకున్న మాజీకౌన్సిలర్ భర్తసదుల వెంకటస్వామి అక్కడికి చేరుకొని పేర్ల సత్యంతో వాగ్వాదానికి దిగాడు. ఈక్రమంలో పేర్ల సత్యం, వెంకటస్వాములు పరస్పరం దాడి చేసుకోగా వెంకటస్వామికి గాయాలయ్యాయి. దీంతో ఇద్దరు కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. కోరుట్ల సీఐ సురేష్‌బాబు, ఎస్ఐ చిరంజీవి సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ఎస్‌యూలో బీ ఫార్మసీ స్పాట్ అడ్మిషన్లు

గణేశ్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వ విద్యాలయం ఎల్ఎండీ క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాలలో బీఫార్మసీ మొదటి సంవత్సరం మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 27వ తేదీన స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు ప్రిన్సిపా ల్ డాక్టర్ కె. శ్రీశైలం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఉదయం 10 గంటలకు ఉజ్వల పార్కు సమీపంలోని ఫార్మసీ కళాశాలలో హాజరు కావాలని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఎక్కడా అడ్మిషన్ తీసుకోని వారికి అవకాశం ఉంటుందని, అభ్యర్థులు ఇంటర్మీడియెట్ వరకు టీసీతో సహా అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఎప్‌సెట్ ర్యాంకు కార్డుతో హాజరు కావాలని సూచించారు. ఎప్‌సెట్ అర్హులు లేని పక్షంలో ఇతరులకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్ల ద్వారా ప్రవేశం పొందిన విద్యార్థులకు ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌కు అర్హత ఉండదన్నారు. సంవత్సరానికి రూ.31,000 ఫీజు చెల్లించాలని తెలిపారు. వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ www.satavahana.ac.in లో సంప్రదించాలని సూచించారు.

మీల్స్ ఆన్ వీల్స్...

రెండేళ్లుగా పేదలకు అల్పాహారం అందిస్తున్న లయన్స్‌క్లబ్




అల్పాహారం పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవలో భాగంగా రామగుండం లయన్స్ క్లబ్ ఎంతో మందికి సేవలందిస్తోంది. పేదలకు, విద్యార్థులకు, చేతులు, కాళ్లు కోల్పోయిన వారికి అవయవాలు, కంటి వైద్య శిబిరాలు, శస్త్ర చికిత్సలు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తారు. వీటితోపాటు లయన్స్‌క్లబ్ రెండు సంవత్సరాలుగా మీల్స్ ఆన్ వీల్స్ అనే కార్యక్రమం ద్వారా ఎందరో పేదలకు అల్పాహారం అందిస్తూ ఆకలిని తీరుస్తోంది. ఈ కార్యక్రమం 2023 అక్టోబరు 7న ప్రారంభించగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుని విజయవంతంగా ముందుకు సాగుతుంది. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఓల్డ్ అశోక థియేటర్ వద్ద మీల్స్ ఆన్ వీల్స్ అల్పాహారం అందిస్తున్నారు.

దీనికి కొందరు దాతలు ముందుకు రావడంతో నిరంతరం కొనసాగుతోంది. నిత్యం ఓల్డ్ అశోక థియేటర్ వద్ద వివిధ ప్రాంతాల నుంచి వచ్చే కూలీలు రోజూ ఇక్కడ అల్పాహారం తిని వివిధ పనులకు వెళుతుంటారు. అంతేకాకుండా ఎవరైనా ఆకలితో ఉన్నా ఇక్కడికి వచ్చి అల్పాహారం తిని వెళుతుంటారు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అటెండర్ల సౌకర్యార్థం కూడా అల్పాహారం అందజేస్తున్నారు. ఎండ, వాన, చలిని లెక్క చేయకుండా లయన్స్‌క్లబ్ సభ్యులు రోజు 8గంటలకు వాహనం ద్వారా తీసుకు వచ్చి పేదల కడుపులను నింపడంపై పలువురు వారిని అభినందిస్తున్నారు. రామగుండం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు, వివిధ పాఠశాలల్లో పేద విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగుల పంపిణీ, కాళ్లు, చేతులు కోల్పోయిన వారికి కృత్రిమ అవయవాలను అందజేస్తున్నారు. 15రోజులకు ఒక సారి ఏదో ఒక సామాజిక కార్యక్రమం తీసుకుంటూ ముందుకు వెళుతున్న లయన్స్‌క్లబ్ ఇటీవల 50సంవత్సరాలను పూర్తి చేసుకున్నది.

అల్పాహార ప్రక్రియ నిరంతర కొనసాగింపు...

మల్లికార్జున్, లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్



పేదల కడుపు నింపడమే లక్ష్యంగా మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమం చేపట్టి రెండు సంవత్స రాలు పూర్తయ్యింది. ఓల్డ్ అశోక్ టాకీస్ వద్ద మొదటిసారిగా అల్పాహారాన్ని ప్రారంభించాం. రోజుకు 250 నుంచి 300మంది వరకు అల్పాహారం అందిస్తున్నాం. మరో రెండు సెంటర్లను ఎంపిక చేసుకుని పేదల కడుపును నింపడం కోసం ప్రయత్నాలు సాగిస్తున్నాం.

2న ఉమ్మడి జిల్లాలో శ్రీచైతన్య స్కాలర్‌షిప్ టెస్ట్

గణేశ్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 2న పదోతరగతి విద్యార్థులకు శ్రీచైతన్య ఐఐటీ, జేఈఈ, మెయిన్స్, నీట్ అకాడమీ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా స్కాలర్ షిప్ టెస్ట్ నిర్వహించనున్నట్లు విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి తెలిపారు. శనివారం నగరంలో స్కాలర్ షిప్ టెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిభ, ఆర్థిక స్థోమత లేని పేద విద్యార్థులకు ఐఐటీ-జేఈఈ మెయిన్స్, నీట్, ఎప్‌సెట్ శిక్షణతో పాటు కార్పొరేట్ స్థాయిలో ఇంటర్ విద్యను అందించాలని శ్రీచైతన్య విద్యాసంస్థ ద్వారా స్కాలర్ షిప్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా 100 శాతం వరకు ఫీజు రాయితీతో కూడిన విద్యను, బహుమతులను అందించనున్నట్లు చెప్పారు. మొదటి బహుమతి ల్యాప్‌టాప్, 2నుంచి 10వ ర్యాంకు వారికి ట్యాబ్స్ అందజేయనున్నట్లు చెప్పారు. పరీక్ష నవంబరు 2వ తేదీన ఉదయం 10 గంటల నుంచి 11:30 వరకు ఉంటుందని తెలిపారు. పరీక్ష కేంద్రాల వివరాలను నవంబరు 1వ తేదీ లేదా అంతకుముందే విద్యార్థులకు తెలియజేయనున్నట్లు చెప్పారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల కోసం కూడా లక్కీ డ్రా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో మొదటి బహుమతిగా ఎస్ఈడీ టీవీ, రెండో బహుమతిగా సైకిల్, ముడో బహుమతిగా మొబైల్ ఫోన్‌ను ప్రోత్సాహకంగా అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు https://forms.gle/rVc2mTjFDDwrdYna9 లింక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు ఫోన్ :9848587584, 9912349038, 9000993705 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య డైరెక్టర్ కర్ర నరేందర్ రెడ్డి, జూనియర్ కళాశాలల డీన్ జగన్ మోహన్ రెడ్డి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్‌లు ఏజీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి

బీసీ ఫెడరేషన్ కులాల సమితి ముఖ్య నాయకుల సమావేశం

ఇల్లందకుంట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సార్ మినీ ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఉమ్మడి జిల్లా బీసీ ఫెడరేషన్ కులాల సమితి ముఖ్యనాయకుల సమావేశం ధర్మాల శంకర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు బెల్లాపు దుర్గారావు మాట్లాడుతూ 2019లో బీసీ 11 కులాల ఫెడరేషన్, కార్పొరేషన్లు కో-ఆపరేషన్ సొసైటీలకు సబ్సిడీ దరఖాస్తులను తీసుకొని లబ్ధిదారులకు గత ప్రభుత్వం ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ లబ్ధిదారులకు సబ్సిడీ బడ్జెట్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యుగేందర్, సదానందం, కిరణ్‌కుమార్, రవీందర్, చంద్రమౌళి, మల్లేశం, కిషన్, లింగయ్య, సాయికృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

నేడు ఉమ్మడి జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ జిమ్నాస్టిక్స్ జూడో ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం ఉమ్మడి జిల్లాస్థాయి జూడో, జిమ్నాస్టిక్స్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో అండర్-17 విభాగంలో బాలబాలికలకు జూడో పోటీలను నిర్వహించనున్నారు. అలాగే అండర్-14, 17 బాలబాలికల విభాగాల్లో జిమ్నాస్టిక్స్ పోటీలను ప్రాంతీయ క్రీడా పాఠశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ప్రధాన కార్యదర్శి బాషబోయిన వేణుగోపాల్ తెలిపారు. పోటీల్లో పాల్గొనుటకు ఆసక్తిగల క్రీడాకారులు సంబంధిత ధృవపత్రాలతో ఉదయం 9 గంటలకు క్రీడా పాఠశాలలో రిపోర్టు చేయాలని కార్యదర్శి సూచించారు.

● **జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు**

జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్ జిల్లా స్థాయి అండర్-14 బాలబాలికల ఫుట్‌బాల్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని జ్యోతినగర్ సెయింట్ జాన్స్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం 1:30 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహించనున్నామని కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు సంబంధిత ధ్రువపత్రాలతో హాజరుకావాలని ఆయన సూచించారు.

జాతీయ స్థాయి ఉషు పోటీలకు కొత్తపల్లి విద్యార్థి


శ్రీరాం

గంభీరావుపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం కొత్తపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 10వ తరగ తి విద్యార్థి పి శ్రీరామ్ జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉషు పోటీలకు ఎంపికయ్యాడు. సెప్టెంబరు 25,26,27 తేదీలలో మహబూబ్‌నగర్‌లో రాష్ట్ర స్థాయి ఉషు పోటీలను నిర్వహించారు. 40 కేజీల పోటీలో శ్రీరాం ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి ఉషు పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 28, 29, 30 తేదీలలో జమ్ము కశ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. శ్రీరామ్ ను స్కూల్ గేమ్స్ జిల్లా సెక్రటరీ నర్ర శ్రీనివాస్‌రెడ్డి, ఉషు జిల్లా సెక్రటరీ, కోచ్ విక్రమ్, పాఠశాల పీడీ భాను అభినందించారు.

ఓయూ తెలుగు పాఠ్యప్రణాళిక సంఘం సభ్యుడిగా పత్తిపాక మోహన్


డాక్టర్ పత్తిపాక మోహన్

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ కవి, రచయిత, బాల సాహితీవేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ బాలసాహితీ పురస్కార గ్రహీత డాక్టర్ పత్తిపాక మోహన్‌ను ఉస్మానియా విశ్వవిద్యాలయం పాఠ్య ప్రణాళిక సంఘం సభ్యుడిగా నియమిస్తూ శనివారం విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. 1997 నుంచి దాదాపు దశాబ్దకాలం పాటు పత్తిపాక మోహన్ ఉమ్మడి కరీంనగర్ డిస్ట్రిక్ కన్సలెటీవ్ కమిటీ సభ్యుడిగా, 14 సంవత్సరాలు వేములవాడ అగ్రహారం డిగ్రీ కళాశాల ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడిగా సేవలందించారు. కేంద్రీయ విద్యాలయం కమిటీ సభ్యునిగా, ఢిల్లీలోని ఆంధ్ర ఎడ్యుకేషనల్ సొసైటీ విద్యా సంస్థల ఎక్స్ అఫీషియోమెంబర్‌గా, హైదరాబాద్‌లోని ఆంధ్ర మహిళా సభ లిటరసీ హౌజ్ సలహా సంఘం సభ్యునిగా రెండు పర్యాయాలు పని చేసి ప్రశంసలు అందుకున్నారు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆధీనంలోని నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా దక్షిణ ప్రాంత అధికారిగా, తెలుగు సంపాదకులుగా మోహన్ 2024 నుండి డిచ్‌పల్లిలోని తెలంగాణ విశ్వవిద్యాలయం బోర్డు ఆఫ్ స్టడీస్ సభ్యుని గా ప్రస్తుతం పనిచేస్తున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం పాఠ్య ప్రణాళిక సంఘం సభ్యుడిగా పత్తిపాక మోహన్ నియామకం కావడం పట్ల సిరిసిల్ల మానసం అధ్యక్షుడు గెంట్యాల భూమేష్, గౌరవ అధ్యక్షుడు టీవీ నారాయణ, సభ్యులు కందేపి రాణిప్రసాద్, ఆడెపు లక్ష్మన్, ఎలగొండ దేవానందం, చిట్కెన కిరణ్‌కుమార్, అంకారపు రవి, గణేష్, వంశీ, అనిత, కామరపు శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

పోలీస్‌స్టేషన్ సమీపంలో ఇరువర్గాల ఘర్షణ

- పంచాయితీలో పరస్పర దాడులు

కోరుట్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పోలీస్ సర్కిల్ కార్యాలయం సమీపంలో శనివారం విడాకుల పంచాయితీ విషయంలో ఇరు వర్గాలు పరస్పరం ఘర్షణ పడ్డాయి. కథలాపూర్ మండలం చింతకుంట గ్రామానికి చెందిన యువతికి రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన యువకుడితో పెద్దల సమక్షంలో ఆరు నెలల క్రితం వివాహం జరిగింది. పెళ్లయిన నెల రోజుల నుంచి దంపతుల మధ్య గొడవలు జరగ్గా భార్య కథలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దంపతులకు కోరుట్ల సర్కిల్ కార్యాలయంలో సీఐ సమక్షంలో పలుమార్లు కౌన్సెలింగ్ నిర్వహించారు. అయినప్పటికీ దంపతుల మధ్య సయోధ్య కుదరకపోవడంతో ఇరువర్గాలకు చెందిన పెద్ద మనుషులు పంచాయితీ నిర్వహించారు. దంపతులు విడిపోవడానికి నిశ్చయించుకోవడంతో వారి అభిప్రాయాన్ని పెద్ద మనుషులు శనివారం పోలీసులకు తెలియజేసి స్టేషన్ నుంచి బయటకు వచ్చారు. అనంతరం అమ్మాయి, అబ్బాయి తరపు వారు ఒకరినొకరు దూషించుకుంటూ గొడవకు దిగడంతో కాసేపు ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. వెంటనే తేరుకున్న పెద్ద మనుషులు ఇరువర్గాలను సముదాయించారు.

అర్బన్ బ్యాంకు ఎన్నికల బరిలో 54 మంది

● ఎస్సీ డైరెక్టర్ స్థానానికి ఎనిమిది మంది పోటీ ● రెండు మహిళా పోస్టులకు ఐదుగురు

● తొమ్మిది జనరల్ స్థానాలకు 41 మంది

కరీంనగర్ టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికల్లో నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 54 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఒక ఎస్సీ, ఎస్టీ డైరెక్టర్ పదవి కోసం ఎనిమిది పోటీ పడగా, రెండు మహిళా స్థానాలకు ఐదుగురు, తొమ్మిది జనరల్ డైరెక్టర్ స్థానాలకు 41 మంది పోటీ పడుతున్నారు. 12 డైరెక్టర్ల పదవుల కోసం నిర్వహించే ఎన్నికల్లో పోటీచేసేందుకు 59 మంది నామినేషన్లను వేయగా, శనివారం జరిగిన నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియలో ఐదుగురు అభ్యర్థులు తమ నామినేషన్లు ఉప సంహరించుకున్నారు. దీనితో 54 మంది పోటీలో ఉన్న వారి పేర్లతో తుదిజాబితాతో పాటు ఎన్నికల గుర్తులను కేటాయించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జగిత్యాల డీసీవో సీహెచ్ మనోజ్‌కుమార్ తెలిపారు.

- ఎస్సీ ఎస్టీ డైరెక్టర్ స్థానానికి అనంతరాజు మన్నె, అసిసిరి ఆనంద్, అలుగు విద్యాసాగర్, బత్తుల రాజ్‌కుమార్, ముషీరాబాద్ లింగరాజు, లింగంపల్లి శ్రీనివాస్, లింగంపల్లి సత్యనారాయణ, సరిళ్ల రతన్ ప్రసాద్ పోటీ పడుతున్నారు.

- రెండు మహిళా డైరెక్టర్ పోస్టులకు కంజర్ల రేణుక, దామెర శ్రీలత, ముద్దసాని శ్వేత, మునిపల్లి ఫణిత, వరాల జ్యోతి పోటీలో ఉన్నారు.

- జనరల్ స్థానాలకు అక్కినపల్లి కాశినాథం, అనురాసుకుమార్, ఇ లక్ష్మణ్‌రాజు, ఇరుమల్ల మల్లేశం, ఉయ్యాల ఆనందం, ఎడబోయిన శ్రీనివాస్‌రెడ్డి, ఎలగందుల మునీందర్, కన్న సాయి, కర్ర రాజశేఖర్, కస్తూరి శ్రీనివాస్‌ప్రసాద్, కూసరి అనిల్‌కుమార్, కైలాసనవీన్, గడ్డం విలాస్‌రెడ్డి, గాదె కార్తీక్‌సాయి పోటీచేస్తున్నారు. గుండ కిషన్, చింతల కిషన్, చిందం శ్రీనివాస్, జంపాల నర్సయ్య, తాటికొండ భాస్కర్, తాడ వీరారెడ్డి, తిరుమణి కరుణాకర్, దేశ వేద్రాది, నాగుల సతీష్, నార్ల శ్రీనివాస్, పాక సురేశ్, బండి ప్రశాంత్ దీపక్, బాశెట్టి కిషన్, బొమ్మరాతి సాయికృష్ణ, మంగి రవీందర్, మహ్మద్ కలీంఖాన్, మహ్మద్ సమియొద్దీన్, ముప్పిడి సునీల్, మూల వెంకటరవీందర్‌రెడ్డి, మహ్మద్ బబ్లూ, లక్కిరెడ్డి కిరణ్‌కుమార్, లుక్క రాజేశం, వజీర్ అహ్మద్, వుమ్మెంతుల శ్రీనివాస్‌రెడ్డి, వొద్నాల రాజు, సయ్యద్ ముజీబ్‌హుస్సేన్, సాయిల్ల రాజమల్లయ్య పోటీలో ఉన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

తంగళ్లపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిని గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆర్ఐ దినేష్, రెవెన్యూ సిబ్బంది గ్రామస్థులతో కలిసి కబ్జాకు గురైన భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ భూమి కబ్జాకు గురికాకుండా చూడాలని మొక్కలు నాటిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి హెచ్‌సీఏ లెవెల్ క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు

● అల్గునూరులో ప్రారంభం కానున్న క్రికెట్ మైదానం

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏ డివిజన్ వన్డే లీగ్ కం నాకౌట్ క్రికెట్ పోటీల్లో భాగంగా కరీనగర్‌లో క్రికెట్ మ్యాచ్‌ను ఆదివారం నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని అల్గునూరులో కరీంనగర్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో నూతనంగా నిర్మించిన వెలిచాల జగపతిరావు మెమోరియల్ క్రికెట్ గ్రౌండ్ అకాడమీలో ఈ మ్యాచ్‌ను నిర్వహించనున్నారు. ఈ మ్యాచ్‌లో భాగంగా కంబైన్డ్ డిస్ట్రిక్ట్ జట్టుతో దక్కన్ వండర్స్ జట్టు తలపడనుంది. దీంతో గత కొన్ని సంవత్సరాలుగా జిల్లా క్రికెట్ క్రీడాకారులు, క్రీడాభిమానులు ఎప్పుడు ఎప్పుడు అని ఎదురుచూస్తున్న క్రికెట్ మైదానం కల నెరవేరనుంది. ఆదివారం ఉదయం 9 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. అలాగే సోమవారం మరో మ్యాచ్ కంబైన్డ్ డిస్ట్రిక్ట్ జట్టుతో బడ్డింగ్ స్టార్స్ జట్టు తలపడనుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోనే మొదటిసారిగా ఇతర జిల్లాలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఈ పోటీలను కరీంనగర్‌లో నిర్వహించడం విశేషం. కొన్ని సంవత్సరాలపాటు జిల్లా క్రికెట్ అసోసియేయన్‌కు అధ్యక్షులుగా ఉండి ఉమ్మడి జిల్లాలో క్రికెట్ క్రీడాభివృద్ధికి కృషి చేసిన వెలిచాల జగపతిరావు పేరును ఈ క్రికెట్ మైదానానికి పెట్టారు. త్వరలో క్రికెట్ మైదానాన్ని పూర్తిస్థాయిలో నిర్మించి మైదానంలో పెవిలియన్ కూడా ఏర్పాటు చేయనున్నామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు వి ఆగంరావు, ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు, సంఘ ప్రతినిధులు కే మహేందర్‌గౌడ్, పి మనోహర్‌రావు, శ్రావణ్ తెలిపారు.


అల్గునూరులో నూతనంగా ఏర్పాటు చేసిన క్రికెట్ స్టేడియం

ధర్మపురిలో ఘనంగా గోదావరి హారతి

ధర్మపురి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని ధర్మపురి వద్ద గోదావరి హారతి కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు లోకక్షేమార్థం గోదావరి వద్ద విశేష పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆల య ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ పాల్గొన్నారు.


ధర్మపురి వద్ద గోదావరి హారతి


ధర్మపురి వద్ద గోదావరిలో దీపాలు వదులుతున్న మహిళలు

● **భక్తుల కార్తీక పూజలు**

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ ఆలయాల్లో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. అనేక మంది మహిళలు నదిలో కార్తీక దీపాలు వదిలారు. భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, నరసింహ హోమం, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నాగ దేవతకు, రావి చెట్టు ఆంజనేయ స్వామి వారికి అర్చకులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ పాల్గొన్నారు.

● **భీమన్న ఆలయంలో కార్తీక దీపోత్సవం**

వేములవాడ కల్చరల్: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో కార్తీక మాసం పురస్కరించుకుని శనివారం సామూహిక దీపోత్సవం నిర్వహించారు. స్థానిక భీమన్న ఆలయానికి వచ్చిన భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో ఓం, స్వస్తిక్, లింగాకృతిలో దీపాలను వెలిగించారు. పూలతో అందంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సేవా సమితి సభ్యులు ఆలపించిన భక్తి గీతాలు, భజన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

● **కొండగట్టులో భక్తుల రద్దీ**

మల్యాల: కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ కనిపించింది. ఆలయంలో స్వామి వారికి మొక్కులు చెల్లించుకొని బేతాళుడు, రాముల వారి వద్ద కూడా పూజలు చేశారు. ఆలయంలో అర్చకులు స్వామి వారికి అభిషేకాలు, నిత్య పూజలు జరిపారు.


వేములవాడ భీమన్న ఆలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు


కొండగట్టులో అంజన్న దర్శనానికి క్యూలైన్‌లో వస్తున్న భక్తులు

క్రీడలతో విద్యార్థులకు ఎన్నో ఉపయోగాలు

- అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రీడల ద్వారా విద్యార్థులకు ఎన్నో ఉపయోగాలు ఉంటాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని భగత్‌నగర్ స్వదేశ్ షూటింగ్ స్పోర్ట్స్ అకాడమీలో 69వ ఎస్‌జీఎఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి ఎయిర్ రైఫిల్ షూటింగ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో ఒత్తిడి నుంచి ఉపశమనం పొందుతారని, తద్వారా విజయ అవకాశాలు మెరుగుపర్చుకోవచ్చని అన్నారు. విద్యార్థులకు విద్యారంగంతోపాటు క్రీడారంగంలో నైపుణ్యం పొందే విధంగా ప్రోత్సాహం అందించాలన్నారు. క్రీడారంగంలో నైపుణ్యం పొందడానికి కావాల్సిన వనరులను సమకూర్చి నిష్ణాతులుగా చేయాలని సూచించారు. తల్లిదండ్రులు సైతం పిల్లలకు వారికి ఇష్టమైన క్రీడలో శిక్షణ ఇప్పించి వివిధ స్థాయిలో నిర్వహించే పోటీలకు ప్రాతినిధ్యం వహించే విధంగా ప్రోత్సాహం అందించాలని కోరారు. క్రీడారంగంలో కరీంనగర్ జిల్లా రాణించడం శుభపరిణామమని, క్రీడారంగ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూతనిస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో స్వదేశ్ షూటింగ్ స్పోర్ట్స్ అకాడమీ డైరెక్టర్ అరుణ్ తేజ, పీఈటీలు, పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.


రైఫిల్ షూటింగ్ పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ వి.నరేందర్ రెడ్డి

ధాన్యం ఆరబోస్తూ రైతు హఠాన్మరణం


సత్యం (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రానికి ధాన్యం తరలించి ఆరబోస్తుండగా ఓ రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామానికి చెందిన రైతు నిమ్మల సత్యం(50) తనకున్న రెండున్నర ఎకరాల్లో వరి సాగు చేశాడు. వారం రోజుల కిందట పైరును కోసి స్థానిక కొనుగోలు కేంద్రానికి తరలించాడు. శనివారం ధాన్యం ఆరబోస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలాడు. అక్కడే ఉన్న రైతులు చేరుకోవడతో అప్పటికే ప్రాణం వదిలాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఘటన స్థలానికి చేరుకున్నారు. సత్యం మరణ వార్త తెలుసుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు రేపాక రామచంద్రారెడ్డి, స్థానిక నాయకులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుడికి భార్య కృష్ణవేణి, కొడుకు స్వరణ్‌వికాస్, కూతురు విశ్వచరణి, తల్లి బాలవ్వ ఉన్నారు. రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

కొడిమ్యాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శనివారంపేట గ్రామానికి చెందిన చర్ల రఘురాం అలియాస్ లక్కీ, మండల కేంద్రానికి చెందిన గుమ్మడిదారి ఆదిత్య అనే వ్యక్తులు కొడిమ్యాల గ్రామ శివారులోని వ్యవసాయ మార్కెట్‌కు సమీపంలో శుక్రవారం రాత్రి గంజాయి అమ్ముతున్నారన్న సమాచారంతో పోలీస్ సిబ్బందితో వెళ్లి పట్టుకున్నట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు రఘురాం, ఆదిత్యను విచారించి అతని వద్ద లభించిన 70గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

కొడిమ్యాల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొల్లోని చెరువు గ్రామానికి చెందిన కొంచెపు రాజు అనే వ్యక్తి శనివారం సాయంత్రం మండల కేంద్రంలోని ఒక పెట్రోల్ బంక్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడినట్లు ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. రాజు ద్విచక్ర వాహనంపై అతివేగంగా, అజాగ్రత్తగా వెళ్తూ ఆర్టీసీ బస్సును ఢీకొనగా అతని తలకు గాయాలైనట్లు తెలిపారు. ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పశువులకు టీకాలు వేయించాలి

జగిత్యాలరూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని వెటర్నరీ అధికారులు పాడి రైతులకు సూచించారు. జగిత్యాల రూరల్ మండలంలోని హైదరాపల్లి గ్రామంలో శనివారం 3 తెల్లజాతి పశువులకు, 98 గేదెలకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు.కార్యక్రమంలో అధికారులు పూర్ణచందర్, సిబ్బంది విశాల్, నరేష్, గ్రామపంచాయతీ సెక్రటరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ

కథలాపూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలను కలిపే లింకు రోడ్ల నిర్మాణ పనులకు శనివారం ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డితో కలిసి కాంగ్రెస్ శ్రేణులు భూమిపూజ చేశారు. భూషణరావుపేట నుంచి మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ దాకా రూ. 2 కోట్లు, చింతకుంట నుంచి కథలాపూర్ గుంటి పెరమాండ్ల దాకా రూ. 2 కోట్లతో బీటీ రోడ్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ ఇంజినీర్ జగదీశ్వర్‌తో కలిసి నాయకులు భూమిపూజ నిర్వహించారు.పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పులి హరిప్రసాద్, జిల్లా మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ గడ్డం స్వామిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ వాకిటి రాజరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి రాధాకృష్ణ ఉన్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రకటించిన ఇండియన్ ఒలంపియాడ్ క్వాలిఫయర్ ఇన్ మ్యాథమెటిక్స్ (ఐఓక్యూఎం)-2025 ఫలితాలలో శ్రీచైతన్య హైస్కూల్ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల డైరెక్టర్ క్యాతం గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా నిర్వహించే మొదటిదశ పరీక్షలో ప్రసన్న, రోహన్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి, రెండవ దశ అయిన ప్రాంతీయ స్థాయి మ్యాథమెటికల్ ఒలంపియాడ్ (ఆర్ఎంఓ)కు అర్హత సాధించారన్నారు.

విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం కృషి


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యా వ్యవస్థ బలోపేతానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. రాయికల్ పట్టణంలోని ఇటిక్యాల రోడ్డులో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.17 లక్షల నిధులతో చేపట్టిన మౌలిక వసతుల కల్పన అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యాబోధన సాగుతుందని, నూతన సాంకేతికతతో విద్యాబోధన కోసం ఉపాధ్యాయులకు వేసవి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న ముఖ్యమంత్రి విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అత్యధిక నిధులు వెచ్చిస్తున్నారని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంతో ప్రభుత్వ కళాశాలల్లో కొంత విద్యార్థుల సంఖ్య తగ్గిందని, తల్లిదండ్రులు కూడా నిత్యం పిల్లలను కనిపెడుతూ చదువులో వారిని ప్రోత్సహించాలన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి బస్సు వేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్, ఎంపీడీవో చిరంజీవి, తహసీల్దార్ నాగార్జున, ఇరిగేషన్ ఈఈ ఏహెచ్ ఖాన్, డీఈ వాజిద్, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, గన్నె రాజరెడ్డి, ఇంటర్ విద్యాశాఖ అధికారి నారాయణ, ప్రిన్సిపాల్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా ట్రస్ట్ సభ్యుల నియామకం

రాయికల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకతీతంగా ట్రస్ట్ సభ్యుల నియామకం చేపట్టినట్లు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. మండలంలోని కొత్తపేట శ్రీ రాజరాజేశ్వర నాగాలయం ట్రస్ట్ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం శనివారం జరిగింది, ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకుముందు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని అన్నారు. ఆలయ కల్యాణ మండపానికి రూ.10 లక్షలు మంజూరు చేశామని, ధ్యాన మందిరం ఏర్పాటుకు రూ.10 లక్షలు మంజూరు చేయగా దాదాపు పూర్తి కావచ్చిందన్నారు. ఆలయ అభివృద్ధికి నూతన సభ్యులు కృషి చేయాలని కోరారు. సహకరించిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగార్జున, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, పీఏసీఎస్ చైర్మన్ మల్లారెడ్డి, నాయకులు కోల శ్రీనివాస్, రవీందర్‌రావు, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజరెడ్డి, శ్రీనివాస్, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ రాములుయాదవ్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

యాసంగికి బేఫికర్

(ఐదో పేజీ తరువాయి)

పరిధిలో మొత్తం ఆయకట్టు 18,66,765 ఎకరాలు ఉంది.

● జిల్లాలో కాలువల ద్వారా సాగు నీరు ఇలా..

జిల్లాలో ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాలువ ద్వారా సాగునీరు అందుతోంది. ఇబ్రహీంపట్నం మండలం నుంచి పెగడపల్లి మండలం వరకు సుమారు 91 కిలోమీటర్ల మేర కాకతీయ కాలువ ప్రవహిస్తోంది. ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువకు విడుదల చేస్తున్న నీరు 25వ కిలోమీటరు వద్ద జగిత్యాల జిల్లాలో ప్రవహిస్తోంది. 116వ కిలో మీటరు వద్ద ముగుస్తోంది. జిల్లాలోని వివిధ గ్రామాలకు కాకతీయ కాలువకు అనుబంధంగా ఉప కాలువలను నిర్మించి నీరు సరాఫరా చేస్తున్నారు. జిల్లాలో డీ-21 ఉప కాలువ నుంచి డీ 83ఏ వరకు దాదాపుగా 62 డిస్ట్రిబ్యూటర్ కాలువలు ఉన్నాయి. ఒక్కో డిస్ట్రిబ్యూటరీకి ఆయకట్టును బట్టి ఎడమ, కుడి వైపులకు మరో 50 వరకు కాలువలు ఉంటాయి. సంబంధిత మైనర్ కాలువల ద్వారా సాగునీరు పంట పొలాలకు అందించాల్సి ఉంటుంది. జిల్లాలో దాదాపుగా ఎస్సారెస్పీ ద్వారా 1.70 లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తున్నారు. డిస్ట్రిబ్యూటరీలకు సమీపంలో ఉండే చెరువులు, కుంటలు నింపేందుకు తూములు ఏర్పాటు చేయడం వల్ల సుమారు మరో లక్ష ఎకరాలకు ఎస్సారెస్పీ సాగు నీరు అందుతోంది.

● యాసంగిలో 3.55 లక్షల ఎకరాల సాగు అంచనా..

జిల్లాలో యాసంగి సీజన్‌లో సుమారు 3.55 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారన్న అంచనా ఉంది. ఇందులో ప్రధానంగా వరి పంటను సాగు చేయనున్నారు. జిల్లాలో వరి పంట 3,03,000 ఎకరాలు, మొక్కజొన్న 27,200 ఎకరాలు, నువ్వులు 21,500 ఎకరాలు, పల్లి 460 ఎకరాలు, పెసర 400 ఎకరాలు, మినుము 250 ఎకరాలు, ఆలసంద 300 ఎకరాలు, ఆవాలు 3,100 ఎకరాలు, చెరుకు 890 ఎకరాలు, ఆయిల్ పామ్ 800 ఎకరాల్లో సాగు అవుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలి

గొల్లపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వరి ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కనీస వసతులు కల్పించాలని ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి నిర్వాహకులను ఆదేశించారు. శనివారం మండలంలోని శ్రీరాములపల్లె, గుంజపడుగు, అగ్గిమల్ల, గంగాదేవి పల్లె, బీబీరాజ్ పల్లె, తిర్మలాపూర్ (పీడీ), నందిపల్లె, ఇస్రాజ్ పల్లె, గంగాపూర్, శెకల్ల, అబ్బాపూర్, వెన్గుమట్ల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గొల్లపల్లి సింగిల్‌విండో ఆధ్వర్యంలో ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి

జగిత్యాలరూరల్ : కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించాలని జగిత్యాల ప్యాక్స్ చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జగిత్యాల రూరల్ మండలం బాలపల్లి, హన్మాజీపేట గ్రామాల్లో ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. పొగళ్లసంధ్యారాణి శ్రీనివాస్‌రెడ్డి, బొడ్డు దామోదర్, బొడ్డులక్ష్మణ్, సీఈఓ వేణు ఉన్నారు.

దళిత ఆత్మగౌరవ నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న చెట్టుపల్లి లక్ష్మణ్

కోరుట్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నవంబరు 1వ తేదీన హైదరాబాదు మహానగరంలో నిర్వహించనున్న దళిత ఆత్మగౌరవ నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్టుపల్లి లక్ష్మణ్ కోరారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్పీ నాయకులతో కలిసి లక్ష్మణ్ మాట్లాడారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన ప్రదర్శనకు అధిక సంఖ్యలో దళితులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జస్టిస్ బీఆర్ గవాయిపై దాడి అంటే రాజ్యాంగంపై జరిగిన దాడేనని, అట్టి సంఘటనలు పునరావృతం కాకుండా నిర్వహిస్తున్న నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్పీ నాయకులు మంగ సాయి, గట్ల సాయి ప్రసాద్, చిట్యాల రాజశేఖర్, గడ్డం ఎల్లయ్య, లక్ష్మణ్, సదుల మనోజ్, వోడ్నాల శ్రీనివాస్ రావు, ఇంతియాజ్, చెటుపల్లి ఓంప్రకాష్, ఫిరోజ్‌బాబు, ప్రమోదులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


మల్యాలలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యం

మల్యాల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ మద్దతు ధరలు పొందాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రైతులకు సూచించారు. మండలంలోని రామన్నపేట, నూకపల్లి, ముత్యంపేటలో ఏర్పాటు చేసిన ప్యాక్స్, ఐకేపీ కొనుగోలు కేంద్రాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోతలు లేకుండా కొనుగోళ్లు చేయాలని అన్నారు. డీఆర్డీవో రఘువరన్, ఆర్డీవో మధుసూధన్‌గౌడ్, ఏఎంసీ చైర్‌పర్సన్ బత్తిని మల్లీశ్వరీశ్రీనివాస్‌గౌడ్, సింగిల్ విండో చైర్మన్ రాంలింగారెడ్డి, ఎంపీడీవో స్వాతి, ఏపీఎం దేవరాజ్, ఆర్ఐ తిరుపతి, సీఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీవోగా రాజ్‌కిషన్

గొల్లపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి ఇన్‌చార్జి ఎంపీవోగా మండలంలోని శ్రీరాములపల్లె పంచాయతీ కార్యదర్శి మల్యాల రాజ్‌కిషన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఇక్కడ ఎంపీవోగా విధులు నిర్వహించిన సురేష్ రెడ్డిని గృహ నిర్మాణ శాఖకు బదిలీ చేయగా, ఆయన స్థానంలో రాజ్‌కిషన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు ఆయన విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఎంపీవోగా విధులు చేపట్టిన రాజ్ కిషన్‌ను ఎంపీడీవో రాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీపీ కార్యాలయం సిబ్బంది శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

వీధి కుక్కల దాడులపై చర్యలు తీసుకోవాలి

రాయికల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న వీధి కుక్కల దాడులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం ప్రజా సంఘాల నాయకులు మున్సిపల్, పశు సంవర్ధక శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. వీధి కుక్కల పునరుత్పత్తి నివారణకు జంతు జనన నిర్మూలన చట్టం-2002 అనుసరించి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కుర్మ మల్లారెడ్డి, సామల సతీష్, బొద్దుల శివ కుమార్, గోనె మహేష్, మాచర్ల మారుతి, చంద రమేష్, సింగని వరుణ్, చింతకుంట సాయి కుమార్, వీరబత్తిని శ్రీధర్, మహేష్ పాల్గొన్నారు.

లాభదాయకంగా ఆయిల్‌పామ్ సాగు

మల్లాపూర్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 25 : రైతులు ఆయిల్ పామ్ సాగుపై ప్రత్యేక దృష్టి సారిస్తే ఎంతో లాభదాయకమని అధికారులు వివరించారు. శనివారం మల్లాపూర్ రైతు వేదికలో కోరమండల్ కంపెనీ ఆధ్వర్యంలో జరిగిన పామ్ ఆయిల్ సాగు అవగాహన సదస్సులో పలువురు వ్యవసాయ, ఉద్యాన వన అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు చేశారు. అధిక దిగుబడికి చేపట్టాల్సిన ఎరువులు, సూక్ష్మపోషకాల గురించి వివరించారు. సదస్సులో కోరుట్ల డివిజనల్ అధికారి రమేష్, మల్లాపూర్ వ్యవసాయాధికారి లావణ్య, ఉద్యాన పంటల అధికారులు స్వాతి, శ్రీనివాస్‌రెడ్డి, పలువురు శాస్త్రవేత్తలు, కోరమాండల్ కంపెనీ అధికారుల, సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు, పాల్గొన్నారు.

దారిని కబ్జా చేసి ఇంటికి వెళ్లకుండా అడ్డుకుంటున్నారు

-కలెక్టరేట్ ఎదుట వంట సామగ్రితో ఓ కుటుంబం నిరసన


కలెక్టర్ కార్యాలయం ఎదుట వంట సామగ్రితో కూర్చున్న బాధిత కుటుంబం

జగిత్యాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) తమ పొరుగు వారు దారిని కబ్జా చేసి ఇంటికి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని ఓ కుటుంబం కలెక్టరేట్ ఎదుట శనివారం వంట సామగ్రితో వచ్చి నిరసన తెలిపింది. రెండు ఇళ్లు కట్టే స్థలంలో మూడు ఇండ్లు నిర్మించి ప్రభుత్వ దారిని కబ్జా చేసి తమ దారికి అడ్డంగా బండ్లు పెడుతూ ఇంటికి వెళ్లకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని వెల్గటూర్ మండలం జగదేవ్‌పేట గ్రామానికి చెందిన నూకల దీవెన కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ విషయమై ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే నూకల దీవెన నిరసన వ్యక్తం చేస్తున్న సమయంలోనే కలెక్టర్ కార్యాలయానికి రాగా సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు.

'అధికారుల పర్యవేక్షణ లోపంతోనే విద్యార్థికి ప్రమాదం'

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ధరూర్‌క్యాంప్ ఎస్సీ బాలుర వసతిగృహంలో విద్యార్థి ప్రమాద ఘటన ముమ్మాటికీ అధికారుల పర్యవేక్షణలోపం వల్లనే జరిగిందని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పి నాయకులు ఆరోపించారు. మల్యాల మండలం మద్దుట్ల గ్రామానికి చెందిన బొల్లె హిమేష్‌చంద్ర గాయపడగా ప్రమాదతీరును హాస్టల్‌కు వెళ్లి పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ బాధ్యులు దుమాల గంగారాం, సురుగు శ్రీను, బెజ్జంకి సతీష్, చెట్‌పెల్లి లక్ష్మణ్, సంగెపు ముత్తు తదితరులున్నారు.

డీఎస్పీగా ఎంపికైన ప్రతిభకు సన్మానం

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):ఇటీవల విడుదలైన టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించి, డీఎస్పీకి ఎంపికైన ప్రతిభను శనివారం జిల్లా సంక్షేమశాఖ అధికారి బోనగిరి నరేష్ శాలువాతో సత్కరించారు. ప్రతిభ తల్లి శైని ఐసీడీఎస్ గ్రేడ్-2 సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తుండగా ఆమె కూతురు డీఎస్పీ హోదా పొందడం పట్ల జిల్లా శాఖ పక్షాన అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీబ్ల్యూవో నరేష్ ప్రతిభను ఆమె తల్లి శైనిని అభినందించారు.

ప్రాక్టికల్ సెంటర్ తొలగించడం అన్యాయం

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్‌లో ప్రాక్టికల్ సెంటర్ తొలగించడం అన్యాయం అని తెలంగాణ మోడల్ స్కూల్స్ టీచర్స్ అసోసియేషన్ (టీఎంఎస్‌టీఏ) రాష్ట్ర ప్రధానకార్యదర్శి కొంతం నరేష్ ఆరోపించారు. ఆయన వెంట జిల్లా అధ్యక్షుడు యాస్వాడ మహేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆసాది ప్రేమ్‌సాగర్‌లు ఉన్నారు.

యూనిటీ మార్చ్‌ను విజయవంతం చేయాలి

జగిత్యాల, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ, మైభారత్ జగిత్యాల జిల్లా పరిపాలన శాఖ, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి సంయుక్తంగా నిర్వహిస్తున్న సర్దార్ 150 యూనివర్సిటీ మార్చ్‌ను విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ రాజాగౌడ్ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్‌లో అధికారులతో కార్యక్రమ నిర్వహణపై సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సర్దార్ 150 యూనిట్ మార్చ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మేరా యువ భారత్ జిల్లా యువజనాధికారి వెంకటరమణ, జిల్లా యువజన క్రీడాధికారి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీవోగా శ్రీకాంత్

మల్యాల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మల్యాల మండల పంచాయితీ అధికారిగా మల్యాల మేజర్ గ్రామపంచాయితీ కార్యనిర్వహనాధికారి ఎస్.శ్రీకాంత్ నియమతిలయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఉత్వర్వులు జారీ చేశారు. ఇక్కడి ఎంపీవో ప్రవీన్ హౌజింగ్ శాఖ అసిస్టెంట్ మేనేజర్‌గా డిప్యూటేషన్‌పై వెళ్లడంతో శ్రీకాంత్‌కు పూర్తి అదనపు భాద్యతలు అప్పగించారు.

ఇద్దరికి డాక్టరేట్

ధర్మపురి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ నివాసి, కేయు రాజనీతి శాస్త్ర పరిశోధకురాలు కటుకం చైతన్యకుమారికి డాక్టరేట్ లభించింది. చైతన్యకుమారికి డాక్టరేట్ లభించినట్లు కాకతీయ విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కట్ల రాజేందర్ శనివారం ప్రకటించారు.

● పెగడపల్లి: పెగడపల్లి మండల కేంద్రానికి చెందిన కొత్తూరి విద్యాసాగర్‌కు శాతవాహన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ఉమేష్ కుమార్ ఆర్థిక శాస్త్ర విభాగంలో డాక్టరేట్ పట్టాను ప్రధానం చేశారు. చదువులపై తల్లిదండ్రుల ఖర్చు (పాటర్న్ ఆఫ్ హౌస్‌హోల్డ్ ఎక్స్‌పెండీచర్ ఆన్ ఎడ్యుకేషన్ ఇన్ తెలంగాణ స్టేట్) అనే అంశంపై పరిశోధనకు గాను డాక్టరేట్ లభించింది.

అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలను పంపించాలి

గొల్లపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రోజు అంగన్‌వాడీ కేంద్రాలకు తమ పిల్లలను తప్పనిసరిగా పంపించాలని అంగన్‌వాడీ టీచర్ సైండ్ల రజిత తల్లులకు సూచించారు. శనివారం గొల్లపల్లి మండలం దమ్మన్న పేట అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ డే కార్యక్రమంను అంగన్‌వాడీ టీచర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ధాన్యం కొనుగోళ్లలో నిబంధనలు పాటించాలి

కోరుట్ల రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ మార్గదర్శకాలతో వరి దాన్యం కొనుగలు నిర్వహించాలని జిల్లా నాన్ పామ్ డీపీఎం నారాయణ ఐకేపీ సీసీలకు సూచించారు. శనివారం కోరుట్ల మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కోరుట్ల, మెట్‌పల్లి మండలాలకు చెందిన ఐకేపీ సీసీలకు ధాన్యం కొనుగోలుపై నిర్వహిస్తున్న శిక్షణను పరిశీలించారు. కార్యక్రమంలో కోరుట్ల, మెట్‌పల్లి ఏపీఎంలు సమతా, అశోక్, జిల్లా నాన్‌పామ్ సీసీ సత్యనారాయణ, కోరుట్ల, మెట్‌పల్లి సీసీలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

వర్షంతో దెబ్బతిన్న పంటలు


మల్లాపూర్‌లో నేలవాలిన వరి పంట

మల్లాపూర్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 25: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. మల్లాపూర్ శివారులో వర్షాలతో పాటు ఈదురు గాలులకు వరి నేలవాలడంతో రైతులకు వర్షాలు తీరని నష్టాన్ని మిగిల్చాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రంను పలువురు బీఆర్ఎస్ నాయకులు సందర్శించి తడిచి మొలకెత్తిన మక్కలను పరిశీలించారు. ప్రభుత్వం బాధిత రైతులను వెంటనే ఆదుకోవాలని, కొనుగోళ్లను త్వరగా ప్రారంభించాలని మల్లాపూర్ మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు.

భూ వివాదంలో దాడి

-ఇద్దరికి గాయాలు

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 25: భూ వివాదం కారణంగా శనివారం మండలంలోని చౌలమద్ది గ్రామంలో శనివారం రాడ్డుతో దాడి చేయడంతో మామ సుద్దాల శంకర్, అల్లుడు కనుక నిఖిల్ తీవ్ర గాయాలపాలైన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివారల ప్రకారం గ్రామానికి చెందిన కనుక మమతకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడంతో నెల రోజుల క్రితం పనులు ప్రారంభించారు. అప్పటి నుంచి గ్రామానికి చెందిన సుద్దాల సంజీవ్, సుద్దాల జగన్‌లు ఇంటి నిర్మాణ పనులు అడ్డుకుంటున్నారు. శనివారం ఇంటి పనులు చేయించేందుకు కనుక మమత అక్కడి వెళ్లింది. ఇంటి పనులు ఏవిధంగా చేయిస్తావని సుద్దాల సంజీవ్, సుద్దాల జగన్‌లు దుర్భాషలాడుతూ కొట్టారు. ఇది గమనించిన భర్త కనుక నిఖిల్ వచ్చి ఎందుకు కొడుతున్నారని నిలదీయగా దాడి చేశారు. ఆపడానికి వచ్చిన తండ్రి సుద్దాల శంకర్‌ను కూడా రాడ్డుతో దాడి చేయడంతో గాయాలయ్యాయి. వెంటనే గాయాలపైన వారిని కుటుంబ సభ్యులు, స్థానికులు మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాడి చేసిన సుద్దాల సంజీవ్, సుద్దాల జగన్‌లపై కనుక మమత మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

టీకాలతో మూగజీవాలకు వ్యాధులు దూరం

పెగడపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గాలికుంటు వ్యాధి టీకాలు వేయించడం ద్వారానే మూగజీవాలు వ్యాధులు దరి చేరకుండా ఆరోగ్యవంతంగా ఉంటాయని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బిప్రకాశ్ పేర్కొన్నారు. శనివారం పెగడపల్లి మండలంలోని రాజారాంపల్లిలో పశువులకు గాలి కుంటు నివారణ టీకాల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశువైద్యాధికారి ప్రకాశ్ మాట్లాడుతూ శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పెగడపల్లి పశువైద్యాధికారి డాక్టర్ హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

గాయపడిన విద్యార్థికి మెరుగైన చికిత్స అందిస్తాం

● మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



వైద్యులతో మాట్లాడుతున్న మంత్రి లక్ష్మణ్‌కుమార్

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని ధరూర్‌క్యాంప్‌లో గల ఎస్సీ బాలుర వసతిగృహంలో పిడుగుపాటుతో తీవ్రంగా గాయపడిన విద్యార్థి హిమేష్ చంద్రకు మెరుగైన చికిత్స అందిస్తామని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. విద్యార్థి ప్రమాదానికి గురవడం బాధాకరమని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ప్రమాదంలో గాయపడి సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హిమేష్‌ను ఆయన శనివారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. చికిత్స పొందుతున్న హిమేష్‌కు అందుతున్న వైద్యసేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. హిమేష్‌కు మెరుగైన వైద్యసేవలు అందిస్తామని,ఎంతటి ఖర్చు అయినా భరిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర చికిత్సనిమిత్తం రూ.5లక్షలు మంజూరు చేశామన్నారు. హిమేష్‌కు పూర్తి చికిత్స అందించేవరకు అండగా ఉంటామని, విద్యార్థి తల్లితండ్రులు కలత చెందవద్దని భరోసా ఇచ్చారు. ఆయన వెంట ఎస్సీ డీడీ అడిషనల్ డైరెక్టర్ శ్రీధర్, హాస్పిటల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపికృష్ణ, హైదరాబాద్ డీడీ ప్రవీణ్‌రెడ్డి, ఏడీ శ్రీనివాస్ తదితరులున్నారు.

కొడిమ్యాల ఎంపీవోగా సురేష్

కొడిమ్యాల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ సహాయకుడుగా విదులు నిర్వహిస్తున్న బి. సురేష్‌కుమార్‌ను కొడిమ్యాల మండల (ఎఫ్ఏసీ)ఫుల్ అడిషనల్ చార్జ్ ఎంపీవోగా కలెక్టర్ నియామకం చేస్తు శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసారు. దీంతో శనివారం సురేష్‌కుమార్ ఎంపీవోగా బాధ్య తలను ఎంపీడీవో స్వరూప సమక్షంలో స్వీకరించారు.

నిబంధనలు పాటించాలి

బీర్‌పూర్,అక్టోబరు 25(ఆంధజ్యోతి):వరి చేను పూర్తిగా పక్వానికి వచ్చిన తర్వాతనే కోతలను ప్రారంభించాలని వ్యవసాయ అధికారి తిరుపతి అన్నారు. శనివారం బీర్‌పూర్ మండలకేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని హార్వెస్టర్ యాజమానులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో భీమేష్, ఏఈవోలు వినోద్, మండలంలోని హార్వెస్టర్ యాజమానులు, రైతులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి


సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ మాజీద్

గొల్లపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మెనూ ప్రకారం విద్యార్థినిలకు రుచికరమైన, నాణ్యమైన భోజనంను అందించాలని తహసీల్దార్ ఎం. డీ. మాజీద్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం గొల్లపల్లి ఆదర్శ కళాశాల వసతి గృహంను తహసీల్దార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహం రికార్డులను, రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. వసతి గృహంలో సరిపడా సిబ్బంది ఉన్నారా..లేరా అని ఆరా తీశారు. సిబ్బంది సమస్యలను అడిగితెలుసుకున్నారు. వసతి గృహంలో కిచెన్ షెడ్‌ను, వంట సామాగ్రిని, నిత్యావసర సరకులను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం విద్యార్థినిలకు భోజనం పంపిణీ చేస్తున్నారా..లేదా అని విద్యార్థినిలను ఆరా తీశారు.

అనంతరం వసతి గృహం పరిసరాలను పరిశీలించారు. సిబ్బంది సమన్వయంతో పని చేయాలని, విద్యార్థినిలకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. తహసీల్దార్ ప్లానింగ్ కో-ఆర్డినేటర్ సత్యానారాయణ, కేర్ టేకర్ సుజాత, వసతి గృహం సిబ్బంది పాల్గొన్నారు.